క్లుప్తంగా

మొక్కలను సంరక్షించాలి



వనపర్తి రూరల్: ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా చూడాలని ఎంపీడీఓ రాఘవ నిర్వాహకులకు సూచించారు. మంగళవారం మండలంలోని నాచహల్లి నర్సరీలో పెంచుతున్న మొక్కలను పరిశీలించారు. మొక్కలు సక్రమంగా పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి నూతన్‌కు సూచించారు. కార్యక్రమంలో క్షేత్ర సహాయకులు వెంకటస్వామి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థి ప్రతిభ



కొత్తకోట: జిల్లా కేంద్రంలో ఈ నెల 14, 15, 16 తేదీల్లో నిర్వహించిన 68వ రాష్ట్ర స్థాయి అండర్–14 క్రికెట్ బాలుర విభాగంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జట్టు తరఫున పెబ్బేర్ మోడల్ స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న ఆయాన్ పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడని ప్రిన్సిపాల్ డాక్టర్ తూర్పింటి నరేష్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జట్టు రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలవడానికి విద్యార్థి ప్రముఖ పాత్ర పోషించాడని కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఉపాధ్యాయ బృందం అభినందించారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు



అమరచింత: మైనర్లకు ద్విచక్ర, ఫోర్‌వీల్ వాహనాలను నడిపేందుకు ఇస్తే వాహన యాజమానిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ సురేష్ తెలిపారు. మండలంలోని మస్తీపురంలో మంగళవారం వాహనాల తనిఖీ నిర్వహించి అనుమతి పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ లేని వాహనదారులకు జరిమానాలు విధించారు. మద్యం తాగి వాహనాలను నడిపితే డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సమయం వృథా చేయొద్దు



పాన్‌గల్: మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని మంగళవారం రాత్రి ఎంఈఓ శ్రీనివాసులు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఎంఈఓ మాట్లాడుతూ భోజనం, అందుతున్న వసతుల గురించి ఆరా తీశారు. పదో తరగతి విద్యార్థులు సమయం వృథా చేయకుండా వార్షిక పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. ఎంఈఓ వెంట ఎమ్మార్సీ సిబ్బంది వెంకటేష్‌యాదవ్, మూర్తి పాల్గొన్నారు.

కొత్తకోట ఎంపీడీఓగా శ్రీనివాసులు



కొత్తకోట రూరల్: స్థానిక ఎంపీడీఓగా పి.శ్రీనివాసులు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన చెన్నమ్మ అమరచింత మండల ఎంపీడీఓగా డిప్యూటేషన్‌పై వెళ్లగా అమరచింత ఎంపీడీఓగా పనిచేస్తున్న పి.శ్రీనివాసులు డిప్యూటేషన్‌పై కొత్తకోట ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టారు. మండల అభివృద్ధి కోసం అన్ని పార్టీల నాయకులు తమకు సహకరించాలని, ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని ఎంపీడీఓ కోరారు. వేసవిలో తాగునీటి సమస్య లేకుండా ఉన్నతాధికారుల ఆదేశానుసారం ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

కులమతాలకు అతీతంగా..



ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని ముస్లింలకు మంగళవారం మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఆగారం ప్రకాష్, గంజాయి రమేష్ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. పండుగలు కులమతాలకతీతంగా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మధు, యాదగిరి, నరేందర్, బాల్‌రాజు, లింగస్వామి, ఎల్లగౌడ్, నయింపాష, అజీమ్, ఇంతియాజ్, గౌస్‌పాష, ముజాహిద్, కదీర్, మోహిద్, ఇబ్రహీం, రహీం తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా 100 రోజుల ప్రణాళిక

- క్షయ నివారణకు ప్రత్యేక చర్యలు
- కలెక్టర్ ఆదర్శ్‌సురభి



మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్‌సురభి

పాన్‌గల్: క్షయ (టీబీ) నివారణకు గ్రామాల్లో నిర్వహిస్తున్న స్క్రీనింగ్ పరీక్షలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి కోరారు. మంగళవారం మండలంలోని మాందాపూర్‌లో నిర్వహించిన టీబీ నిర్ధారణ పరీక్షలను వైద్య, ఆరోగ్యశాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వైద్యసిబ్బంది గ్రామానికే వచ్చి మధుమేహ, క్షయ తదితర వ్యాధి నిర్ధరణ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నందున గ్రామస్తులు అందుబాటులో ఉండి చేయించుకోవాలన్నారు. క్షయకు సంబంధించి 100 రోజుల ప్రణాళికను పక్కాగా అమలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పరీక్షలకు వచ్చే వైద్యసిబ్బంది గ్రామాల్లో ఒకరోజు ముందుగానే చాటింపు వేయించాలని సూచించారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ గోవర్ధన్‌సాగర్, డీఎంహెచ్‌ఓ డా. శ్రీనివాసులు, జిల్లా క్షయ నియంత్రణ అధికారి డా. సాయినాథ్‌రెడ్డి, ప్రోగ్రామ్ అధికారి డా. రామచందర్‌రావు, డా. పరిమళ, మాజీ సర్పంచ్ జయరాములుసాగర్, మండల స్థాయి అధికారులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టులది కీలక పాత్ర

వనపర్తి: సమాజంలోని సమస్యలను వెలికితీయడంలో జర్నలిస్టులదే కీలక పాత్ర అని, అటువంటి జర్నలిస్టులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ కలిగి ఉండాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి అన్నారు. మంగళవారం టీయూడబ్ల్యూజే(ఐజేయూ) ఆధ్వర్యంలో చిట్యాల శివారులోని దేశినేని శ్యామలమ్మ ఫంక్షన్ హాల్‌లో మెడికోవర్ ఆస్పత్రి, హైటెక్ సిటీ వారి సహకారంతో జిల్లాలోని జర్నలిస్టులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌తో పాటు డీపీఆర్‌ఓ సీతారాంనాయక్, జిల్లా వైద్యశాఖ అధికారి శ్రీనివాసులు, మెడికవర్ ఆస్పత్రి కార్డియాలజిస్టు దయా వాస్విని, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కార్యదర్శి మధుగౌడ్, జర్నలిస్టులు బొడ్డుపల్లి లక్ష్మన్, మన్యం, తైలం అరుణ్‌రాజ్, గంధం దినేష్‌కుమార్‌ను జర్నలిస్టులు శాలువాతో సన్మానించారు.

స్కూల్ యూనిఫాం అందేలా చూడాలి

వచ్చే విద్యా సంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు సకాలంలో యూనిఫాం అందించే విధంగా ఇప్పటి నుంచే కార్యాచరణ ప్రారంభించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీ విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా ఇచ్చే యూనిఫాం విషయంలో మంగళవారం మధ్యాహ్నం కలెక్టర్ తన ఛాంబర్‌లో విద్యా, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీల్లో చదువుకుంటున్న 40వేల మందికిపైగా విద్యార్థులకు వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే నాటికి కనీసం ఒక జత యూనిఫాం అందించే విధంగా వెంటనే చర్యలు ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఇన్‌చార్జ్ యాదయ్య, డీఈఓ మహ్మద్‌ఘని, గ్రామీణాభివృద్ధి శాఖ పీడీ ఉమాదేవి, డీపీఎం అరుణ తదితరులు ఉన్నారు.

బరువు తక్కువ పిల్లలను గుర్తించాలి

జిల్లాలో ఆరేళ్లలోపు పిల్లల్లో వయస్సుకు తగ్గ ఎత్తు, బరువు లేని వారిని గుర్తించి ఎన్‌ఆర్‌సీకి పంపించాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో స్యామ్, మ్యామ్ పిల్లలు, దివ్యాంగుల స్వయం ఉపాధిపై సంక్షేమ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్‌ఆర్‌సీలో వైద్య సిబ్బందితో పాటు ఒక అంగన్‌వాడీ కార్యకర్త, హెల్పర్, ఆశావర్కర్‌ను అందుబాటులో ఉంచే విధంగా చూడాలన్నారు. అదేవిధంగా నిబంధనల మేరకు పిల్లల వెంట వచ్చే తల్లికి రోజుకు నిర్దేశించిన డబ్బును చెల్లించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి, సూపరింటెండెంట్, సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, అధికారులు ఉన్నారు.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి



వరి పంటలో నీటి తడులపై సూచనలు ఇస్తున్న ఏఓ డాకేశ్వర్‌గౌడ్

వీపనగండ్ల: యాసంగిలో వరి పంట సాగు చేసిన రైతులు నీటి ఎద్దడి నివారణ కోసం వ్యవసాయ అధికారులు సూచించిన విధంగా నీటి యాజమాన్య పద్ధతులు అవలంబించాలని మండల వ్యవసాయ అధికారి డాకేశ్వర్‌గౌడ్ అన్నారు. మంగళవారం తూంకుంట శివారులో 'వరి పంట సాగు–నీటి యాజమాన్య పద్ధతులు' అనే అంశంపై రైతులకు అవగాహన కల్పించారు. నీటి వృథాను అరికట్టడం వల్ల పంట దిగుబడిని పెంచుకోవచ్చని ఆయన రైతులకు సూచించారు. పంట చివరి దశలో పొటాషియం నైట్రేట్ ద్రావణాన్ని పిచికారీ చేయడం వల్ల పంటలను అధిక ఉష్ణోగ్రత నుంచి కాపాడుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు జితేందర్, అఖిలాష్, రైతులు బ్రహ్మానందరెడ్డి, రాములు పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు

ఆత్మకూర్: అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ నరేందర్ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రేచింతల శివారులోని ఊకచెట్టు వాగులోంచి ట్రాక్టర్ల యజమానులు మైనింగ్ అధికారులు సూచించిన ప్రదేశంలో కాకుండా వేరే ప్రదేశంలో ఇసుకను తవ్వుకుంటున్నారన్నారు. ఈమేరకు ట్రాక్టర్ల యజమానులకు హెచ్చరికలు జారీ చేశామని చట్టవిరుద్ధంగా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వనపర్తి వాసులకు మహాస్వామి పురస్కారాలు



పురస్కారాలు అందుకుంటున్న పట్టణవాసులు

వనపర్తిటౌన్: సామాజిక, సాహిత్య, విద్యా రంగంలో సేవలు అందించిన వారికి నారాయణపేట జిల్లా నేరడగం క్షేత్రంలో సోమవారం రాత్రి తృతీయ సిద్ధలింగ మహాస్వామి స్మారక పురస్కారాన్ని అందజేశారు. ఈ నేపథ్యంలో పట్టణానికి చెందిన గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు పలుస శంకర్‌గౌడ్, చంద్రశేఖర్‌కు విద్యా రంగంలో, చిన్నమ్మ థామస్‌కు సామాజిక సేవ, ఆకుల శివరాజలింగంకు సాహిత్య రంగంలో చేసిన సేవలకు గాను తృతీయ సిద్ధలింగ మహాస్వామి స్మారక పురస్కారం వరించాయి. ఈ మేరకు వారికి మంగళవారం పట్టణ సాహితీవేత్తలు కదూరు నారాయణరెడ్డి, బిచ్చయ్య, బైరోజు చంద్రశేఖర్, శ్రీనివాస్, డాక్టర్ శ్యామ్‌సుందర్, డాక్టర్ నరేష్‌కుమార్, రాములు అభినందనలు తెలిపారు.

హుండీ చోరీకి విఫలయత్నం

అమరచింత: పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలోని హుండీని పట్టణానికి చెందిన యువకుడు ఎత్తుకెళ్లేందుకు యత్నించి కాలనీవాసుల చేతికి చిక్కిన ఘటన పట్టణంలో మంగళవారం చోటుచేసుకుంది. పట్టణంలోని శ్రీకృష్ణనగర్‌కు చెందిన ఓ యువకుడు మతిస్థిమితం లేని కారణంగా సారాకు బానిసయ్యాడు. గతంలో డ్రైవర్‌గా పని చేస్తూ హైదరాబాద్‌లో జరిగిన ప్రమాదంలో గాయపడి మతిస్థిమితం కోల్పోయాడని కాలనీవాసులు తెలిపారు. సారాకు బానిస అయిన యువకుడు చేతిలో డబ్బులు లేకపోవడంతో ఆలయంలోని హుండీని తీసుకెళ్లాలని భావించాడు. ఈ క్రమంలో హుండీతో వెళ్తున్న యువకుడిని కాలనీవాసులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

బీఆర్‌ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్



వీపనగండ్లలో పోలీసుల అదుపులో బీఆర్‌ఎస్ యువనాయకులు

కొత్తకోట రూరల్/ఆత్మకూర్/వీపనగండ్ల: అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డిని అక్రమంగా అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం పిలుపు మేరకు మంగళవారం అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న బీఆర్‌ఎస్ యువజన విభాగం నాయకులకు కొత్తకోట పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ యువజన విభాగం నాయకులు కె.శ్రీనివాస్‌జీ మాట్లాడుతూ అధికార పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ అసెంబ్లీలో నిలదీసిన జగదీశ్వర్‌రెడ్డిని సస్పెండ్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. అక్రమ అరెస్టులతో తమ గొంతు నొక్కలేరని, ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చే వరకు బీఆర్‌ఎస్ పోరాడుతుందన్నారు. అరెస్టయిన వారిలో పపుల నెహ్రూ, రవికుమార్, విజయ్, గుర్రం చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

- ఆత్మకూర్ నుంచి అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి బయలుదేరిన బీఆర్‌ఎస్‌వీ నాయకులను అరెస్టు చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయిన వారిలో బీఆర్‌ఎస్ విద్యార్థివిభాగం నియోజకవర్గ అధ్యక్షుడు రియాజ్‌అలీ, శాలంపాష, అహ్మద్, దర్వేష్ తదితరులు ఉన్నారు. అనంతరం వారిని పోలీసులు సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.
- వీపనగండ్ల నుంచి చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళ్తున్న పలువురు బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల అదుపులో ఉన్న వారిలో బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముంత శివయాదవ్, శేఖర్‌యాదవ్, మండల వీరబాబు, క్రాంతి, సాయిరాజు తదితరులు ఉన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

గోపాల్‌పేట: చిన్ననాటి నుంచే యోగా నేర్చుకుని, ప్రతిరోజు సాధన చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఆయుష్ యోగా శిక్షకుడు శ్రీనివాసులు అన్నారు. మంగళవారం ఆయన రేవల్లి మండలంలోని నాగపూర్ పాఠశాల గ్రౌండ్‌లో విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. యోగా చేయడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. అనంతరం విద్యార్థులతో యోగా చేయించారు. ప్రతి రోజు యోగా చేస్తే మనసు ప్రశాంతంగా ఉంటుందని, దీంతో చదువు, ఇతర పనులపై ఆసక్తి పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పాపులు, మాజీ ఎంపీటీసీ శ్రీశైలం, రాములు, రామకృష్ణ, కుర్మయ్య, పరమేష్, తదితరులు పాల్గొన్నారు.



'భయం వీడితేనే పరీక్షల్లో రాణిస్తారు'



పామాపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులతో ఉపాధ్యాయులు

వీపనగండ్ల: పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు భయం వీడి పరీక్షలను రాసినప్పుడే ఉత్తమ ఫలితాలను సాధించే అవకాశం ఉందని మండల విద్యాధికారి నర్సింహ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో 10వ తరగతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. వార్షిక పరీక్షల నిర్వహణ కోసం అన్ని రకాల ఏర్పాట్లు చేశామని, విద్యార్థుల్లో మనోధైర్యం నింపేందుకు ప్రత్యేక తరగతులను నిర్వహించామన్నారు. పరీక్షల్లో రాణించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని పాఠశాల విద్యాకమిటీ చైర్‌పర్సన్ ఎత్తం చిట్టెమ్మ విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం భానుప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీడ్కోలు సమావేశం

కొత్తకోట రూరల్: మండలంలోని పామాపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో మంగళవారం 9వ తరగతి విద్యార్థులు 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రధానోపాధ్యాయులు జి.రవి మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలు అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు రాంరెడ్డి, న్యాయవాది శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం ఎస్.గోపాల్, అమృతరాజు, రామసుబ్బారెడ్డి, చంద్రమౌళిగౌడ్, పి.శ్రీనివాస్‌రెడ్డి, నాగమణి, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

స్వయం పాలన దినోత్సవం

పాన్‌గల్: మండలంలోని చిక్కేపల్లి ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి స్వయం పాలన దినోత్సవం, వీడ్కోలు సమావేశం నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని జీహెచ్‌ఎం శివయ్య సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, భాస్కర్, రాజు, వినోద్‌కుమార్, కృష్ణయ్య, రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులు 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు పదో తరగతి హాల్‌టికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కాళిదాస్, ఉపాధ్యాయులు లక్ష్మారెడ్డి, శ్రీను, సురేందర్‌రెడ్డి, భాను ప్రకాష్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఉపాధి'హామీ పనుల పరిశీలన



పామిరెడ్డిపల్లి శివారులో ఉపాధి హామీ పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ సద్గుణ

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లి శివారులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ సద్గుణ పరిశీలించారు. పనులు జరిగే ప్రదేశంలో కూలీలు జాగ్రత్తగా పనులు చేయాలని, ప్రభుత్వం సూచించిన సమయంలో పనులు ముగించుకుని వెళ్లాలన్నారు. ఈ సందర్భంగా కూలీల మస్టర్ పట్టికతో పాటు రికార్డులను ఎంపీడీఓ పరిశీలించారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో కూలీలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కూలీలకు కావాల్సిన ఓఆర్‌ఎస్ పాకెట్లు, తాగునీటిని అందుబాటులో ఉంచాలని ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్‌కు సూచించారు.

కూలీలకు టెంట్లు ఏర్పాటు చేయాలి

ఆత్మకూర్: ఎండల తీవ్రత పెరిగిన నేపథ్యంలో ఉపాధి పని ప్రదేశంలో కూలీలకు టెంట్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలని వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు డిమాండ్ చేశారు. మంగళవారం గుంటిపల్లిలో ఆయన ఉపాధి కూలీలతో మాట్లాడారు. కూలీలు రోజంతా పనిచేస్తే కేవలం రూ.వంద కూలి మాత్రమే వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కనీస కూలి రూ.300 అయినా ఇవ్వాలని కోరారు. కేంద్రం ప్రభుత్వం ఉపాధిహామీ పథకానికి తక్కువ బడ్జెట్ విడుదల చేస్తూ పేదలకు అన్యాయం చేస్తోందని దుయ్యబట్టారు.

జిల్లా మహాసభను జయప్రదం చేద్దాం



అమరచింతలో కరపత్రాలు విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

అమరచింత: సీపీఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా జిల్లా కేంద్రంలోని దాచ లక్ష్మయ్య ఫంక్షన్ హాల్‌లో ఈనెల 23న నిర్వహించే జిల్లా మహాసభలను జయప్రదం చేద్దామని సీపీఐ మండల కార్యదర్శి అబ్రహం అన్నారు. మహాసభలకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం పార్టీ జెండా కట్ట వద్ద ఆవిష్కరించారు. వందేళ్ల ఆవిర్భావ వేడుకల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో భాస్కర్, రవీందర్, శ్యాంసుందర్, సోలు, ఇజ్రాయిల్ పాల్గొన్నారు.

పాన్‌గల్: జిల్లా కేంద్రంలో ఈనెల 23వ తేదీన భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా నిర్వహిస్తున్న సీపీఐ శత జయంతి ఉత్సవాలకు మండలంలోని ప్రతి గ్రామం నుంచి భారీగా తరలిరావాలని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు కాకం బాలస్వామి కోరారు. మంగళవారం మండలంలోని తెల్లరాళ్లపల్లి గ్రామంలో శత జయంతి ఉత్సవాల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సహదేవ్, రాముడు, శాలి, శేఖర్, బొజ్జన్న తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష రాసేందుకు వెళ్తుండగా ప్రమాదం

- బైక్ పైనుంచి పడి విద్యార్థినికి తీవ్రగాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాగవేణి

ఆత్మకూర్: పరీక్షకు సమయం ఆసన్నమైందని ద్విచక్రవాహనంపై వేగంగా వస్తున్న విద్యార్థిని కిందపడి తీవ్రంగా గాయపడిన ఘటన ఆత్మకూర్‌లో చోటుచేసుకుంది. మరికల్ మండలంలోని ఎలిగండ్లకు చెందిన విద్యార్థిని నాగవేణి ఇంటర్ సెకండియర్ పరీక్షలను స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాస్తున్నారు. మంగళవారం ఉదయం తన భర్త అనిల్ కుమార్‌తో కలిసి పరీక్ష కేంద్రానికి బైక్‌పై వస్తుండగా ఖానాపూర్ స్టేజీ వద్ద స్పీడ్ బ్రేకర్ గమనించకుండా వేగంగా రావడంతో నాగవేణి బైక్‌పై నుంచి కిందపడిపోయింది. ఈ ఘటనలో నాగవేణికి తీవ్ర గాయాలవ్వగా అనిల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. విషయాన్ని గమనించిన ప్రయాణికులు వారిని స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్సల అనంతరం మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. స్పీడ్ బ్రేకర్లు కనిపించకపోడంతోనే ప్రమాదం జరిగిందని, రాయాల్సిన పరీక్షకు హాజరు కాలేకపోయానని నాగవేణి కంటతడి పెట్టుకుంది.

'మామిడి రైతులను ఆదుకోవాలి'



మామిడి తోటలను పరిశీలిస్తున్న నాయకులు

వీపనగండ్ల: మండల కేంద్రంలో కొందరు రైతుల మామిడి తోటలు, మరికొన్ని గ్రామాల్లో గడ్డివాములు దగ్ధం కావడంతో రైతులు ఆర్థికంగా నష్టపోయారని, ప్రభుత్వపరంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఎం మండల నాయకులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం మండల కేంద్రం శివారులో తెలుగు పెద్ద శేషయ్య, వెంకటయ్య, చిన్నశేషయ్య మామిడి తోటలకు నిప్పంటుకొని దాదాపు 300 మామిడి చెట్లకు నష్టం వాటిల్లడంతో డ్రిప్ పరికరాలు కూడా కాలి బూడిదవ్వడంతో రైతులకు రూ.5 లక్షల నష్టం వాటిల్లిందని మండల నాయకుడు బాల్‌రెడ్డి అన్నారు. తరుచు మామిడి తోటలు అగ్నికి ఆహుతి అవుతుండడంతో కొందరు దుండగులు ఉద్దేశపూర్వకంగా తోటలకు నిప్పుపెడుతున్నారా.. ప్రకృతిపరంగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయా అనే అంశాన్ని పోలీసు అధికారులు గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. బాధితులకు పరిహారం చెల్లించకుంటే పార్టీ పరంగా రైతులను సమీకరించి ఆందోళనలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఈశ్వర్, వెంకటేశ్వర్లగౌడ్, బాలస్వామి, రామకృష్ణ, నర్సింహ, శ్రీను, బాధిత రైతులు పాల్గొన్నారు.

కొన్నూరులో తాగునీటి సమస్య తీర్చండి



కుళాయి వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజలు

మదనాపురం: మండలంలోని కొన్నూరులో 9, 10 వార్డుల్లో నెలకొన్న తాగునీటి సమస్య తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు. కొన్ని రోజులుగా గ్రామంలో తాగునీరు సక్రమంగా రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ప్రజలు వాపోతున్నారు. మంగళవారం కూడా నీటి సరఫరా లేకపోవడంతో తాగడానికి ఇబ్బంది ఏర్పడిందని ఆయా వార్డు ప్రజలు కుళాయి వద్ద నిరసన వ్యక్తం చేశారు. పలుమార్లు నీటి సమస్య తీర్చాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలనీలో తాగునీటి సమస్య తీర్చాలని కోరుతున్నారు.

ఈదమ్మ జాతర ప్రారంభం



చెన్నారంలో బోనమెత్తిన మహిళలు

గోపాల్‌పేట: ఏదుల మండలంలోని చెన్నారంలో మంగళవారం ఈదమ్మ బోనాలు, ఉత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ ఉమ్మడి మండల ఇన్‌చార్జ్ సత్యశీలారెడ్డి హాజరయ్యారు. మంగళవారం మహిళలు బోనమెత్తి ఈదమ్మ అమ్మవారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం జాతరలో కబడ్డీ, వాలీబాల్ పోటీలు జరుగుతాయని, అలాగే గురువారం ఎమ్మెల్యే మేఘారెడ్డి హాజరై బండలాగుడు పోటీలు ప్రారంభిస్తారని తెలిపారు. శుక్రవారం రోజు క్రీడలు పూర్తవుతాయని, క్రీడల్లో ప్రతిభ కనబర్చినవారికి బహుమతులు ప్రదానం చేయడంతో జాతర ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గుంటి సురేందర్, భాస్కర్‌రెడ్డి, కోడిగంటి రాంచందర్, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సాయిరాంరెడ్డి, అబ్దుల్లా, స్థానిక ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

వార్డు సమస్యలు పరిష్కరించండి



సమస్యలు గుర్తిస్తున్న సీపీఎం నాయకులు

అమరచింత: పట్టణంలోని 5వ వార్డులో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం మండల నాయకుడు అజయ్ డిమాండ్ చేశారు. 5వ వార్డులో మంగళవారం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకునేందుకు సీపీఎం ఆధ్వర్యంలో పర్యటించారు. మాజీ ఎంపీ విఠల్ రావు శంకుస్థాపన చేసిన ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణం నేటికీ అసంపూర్తిగా మిగిలిడటం శోచనీయం అన్నారు. 40 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన కరెంటు వైర్లు ఉండటంతో షార్ట్ సర్క్యూట్ వచ్చే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశా. మాలవీధి నుంచి ఎస్సీ కాలనీ స్కూల్ మీదుగా సీసీ రోడ్డు వేయాలని కోరారు. కార్యక్రమంలో బుచ్చన్న, భక్తరాజు, రవి,అరుణ్, నిశాంత్, విజయ్ పాల్గొన్నారు.